
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట




## సన్‌డే

- ఫిబ్రవరిలోనే మండుతున్న ఎండలు
- ఉమ్మడి జిల్లాలో 37 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- సాధారణం కంటే 3 డిగ్రీలు అధికం
- అత్యధికంగా సిద్దిపేటలో 37.5 డిగ్రీలు

7

బీజేపీ, కాంగ్రెస్ మధ్యే

## ప్రధాన పోటీ

- బీఆర్ఎస్ పని అయిపోయింది
- ఉద్యమగడ్డ అని చెప్పుకునే జిల్లాలోనే అభ్యర్థి లేడు

7

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు




సంగారెడ్డి పట్టణ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి

# సంగారెడ్డిలో భారీ మెజారిటీ రావాలి

*నియోజకవర్గ కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి*

సంగారెడ్డిరూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్నందున ప్రత్యర్థిపై కాంగ్రెస్ అభ్యర్థికి 3వేల ఓట్ల ఆధిక్యం వచ్చేలా చూడాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కార్యకర్తలకు సూచించారు. సంగారెడ్డి పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన సంగారెడ్డి మండలస్థాయి కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 3వేల మెజారిటీ రావాలని కార్యకర్తలకు జగ్గారెడ్డి సూచించారు. పార్టీ సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని పేర్కొన్నారు.



ఘణపూర్ పంప్‌హౌజ్ నిర్మాణ పనులపై ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

పంప్‌హౌజ్ పనులు

# వేగవంతం చేయాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని నంగునూరు మండలం ఘణపూర్‌లో నిర్మిస్తున్న ఘణపూర్ పంప్‌హౌజ్ నిర్మాణ పనులపై ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పంప్‌హౌజ్ నిర్మాణ పనుల జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అవసరమైన విద్యుత్ సరఫరా, భూసేకరణ చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నప్పటికీ పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతుందన్నారు. పనుల్లో వేగం పెంచి నెలాఖరు వరకు అందుబాటులోకి తేవాలన్నారు. ఇప్పటికే రంగనాయకసాగర్‌ద్వారా వస్తున్న నీళ్లను మండలంలోని కాలువల ద్వారా గ్రామాల్లోని చెరువులకు నీళ్లు వచ్చే విధంగా అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేసి రైతులకు మేలు జరిగేలా చూడాలన్నారు.

### గొర్రెలు ఇవ్వకుండా డీడీలు వాపస్ ఇచ్చారు

యాదవులకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించి, ఆర్థికంగా భరోసా కల్పించామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో యాదవులకు అన్యాయం జరుగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శ్రీకృష్ణయాదవ ఫంక్షన్‌హాల్ సభ్యులకు గుర్తింపు కార్డుల పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. కేసీఆర్ యాదవులకు ఎమ్మెల్యే సీట్లు ఇచ్చారని, మంత్రి పదవుల్లో స్థానం కల్పించారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్కరికీ కూడా మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. గతంలో చేసిన గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేయ డం లేదని, గొర్రె పిల్లలు ఇవ్వకుండా డీడీలు కూడా వాపస్ ఇచ్చారన్నారు.

# వండర్‌ఫుల్



సూర్యనమస్కారాలు చేస్తున్న యోగా సాధకులు

- ఉత్సాహంగా శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన
- వండర్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదు
- పాల్గొన్న 1,484 మంది.. 4,02,154 సూర్య నమస్కారాలతో రికార్డ్

7



# ప్రణాళికాబద్ధంగా చదవాలి

- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో షెడ్యూల్డ్ కులాలు అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్నివసతి గృహాలకు సంబంధించిన పదోతరగతి విద్యార్థులకు నిపుణులతో వార్షిక పరీక్షలపై ప్రేరణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై పరీక్షలకు సంబంధించి మెళుకువలపై మాట్లాడారు. విద్యార్థులు రోజులో చదువు, నిద్ర, విశ్రాంతి సమతుల్యం చేసుకోవాలన్నారు. అభ్యాస పరీక్షలు రాస్తూ ఉంటే, అసలు పరీక్షలో ఒత్తిడిని తగ్గించుకోవచ్చని, స్నేహితులతో కలిసి చర్చించాలని చెప్పారు. అలాగే ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని, సమయానికి భోజనం, తగినంత నిద్ర, సాధ్యమైనంత వరకు ప్రాణాయామం, యోగాతో ఒత్తిడిని తగ్గించుకోవడం మంచిదని సూచించారు.

# మల్లన్న ఆలయం.. భక్తజనమయం

- 4వ వారం జాతరకు

తరలివచ్చిన భక్తజనం



చేర్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోవారాన్ని పురస్కరించకుని ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నానమాచరించారు. భక్తిప్రపత్తులతో బోనం నివేదించి పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో వీవీఐపీ, ప్రత్యేక ఉచిత దర్శన క్యూలైన్లలో బారులు తీరారు. స్వామివారి దర్శనానికి సుమారు 3 గంటల పాటు సమయంపట్టడంతో ఇబ్బందులు పడ్డారు. చేర్యాల సీఐ ఎల్. శ్రీను ఆధ్వర్యంలో బ ందోబస్తు నిర్వహించారు. హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్ బం దోబస్తు చర్యలు పర్యవేక్షించారు.

### తప్పిపోయిన చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగింత

భూపాలపల్లికి చెందిన పలువురు భక్తులు మల్లన్న దర్శనానికి వెళుతున్న క్రమంలో ఆరేళ్ల కూతురు ఖుషి తప్పిపోయి ఏడుస్తుండగా, ఆలయ సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న మహి ళా కానిస్టేబుల్ చేరదీసి కంట్రోల్ రూమ్‌కు తీసుకువచ్చింది. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ద్వారా మైక్‌అనౌన్స్‌మెంట్ చేయడంతో కంట్రోల్ రూం వద్దకు చేరుకున్న తల్లిదండ్రులకు పాపను సురక్షితంగా అప్పగించారు. తప్పిపోయిన పలువురు వృద్ధమహిళలను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు.

### ఆలయంలో రాగి డాలర్లు విక్రయం

భక్తులకోసం మల్లన్న ముఖచిత్రంతో తయారుచేసిన రాగి డాలర్లు విక్రయించేందుకు దేవాదాయశాఖ చర్యలు చేపట్టింది. గతంలో కమిషనర్ అనిల్‌కుమార్ హయాంలో రాగిడాలర్లు తయా రు చేయించినప్పటికీ ఆలయాధికారులు జా ప్యం వహించారు. ఆదివారం ఆలయాధికారులు బుకింగ్ కార్యాలయంలో కౌంటర్ ఏర్పాటు చేశారు. 2.5గ్రాముల డాలర్ ధర రూ.40, 5 గ్రాముల డాలర్‌ను రూ.70 చొప్పున విక్రయించనున్నట్లు తెలిపారు.

### కిటకిటలాడిన నాచగిరి క్షేత్రం

వర్గల్ :నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పుష్కరిణీలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి సన్నిధిలో కల్యాణాలు 6, సత్యనారాయణస్వామి వ్రతాలు 28, స్వామివారికి అభిషేకాలు 14 మంది భక్తులు నిర్వహించినట్లు ఆలయాధికారులు తెలిపారు.

### మర్పడగలో ఆర్ధ మహోత్సవం

కొండపాక : కొండపాక మండలం మర్పడగ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున క్షేత్రంలో ఆదివారం ఆర్ధ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకులు హరనాథ శర్మ పర్యవేక్షణలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, నీరాజన సేవ జరిగాయి. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు గట్టు విఠల్, మర్యాల రవీందర్, తిరుపతిరెడ్డి, శ్రీశైలం, నరసింహారెడ్డి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

### నందిపై వానరం..

భక్తులు పూజలు నిర్వహిస్తుండగా ఓ కోతి వచ్చి ఆలయం ముందున్న నంది విగ్రహంపై కూర్చుంది. కొందరు తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు.



పూర్ణాహుతి చేస్తున్న అర్చకులు



కోడ్ అమల్లోకి వచ్చినా

# నిద్రావస్థలో అధికార యంత్రాంగం!

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలు చేయడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది. ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో ఉపాధ్యాయ, పట్టాభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలై ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. షెడ్యూల్ విడుదలై పదిరోజులు అవుతున్నా ఎన్నికల సంఘం ఆదేశానుసారం పనిచేయాల్సిన అధికార యంత్రాంగం సిద్దిపేటరూరల్, నారాయణరావుపేట, నారాయణరావుపేట మండలంలో ఇంకా నిద్రావస్థలో ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయడం ఆనవాయితీ. అయితే సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లో పలు గ్రామాల్లో ఈ నిబంధనలు వారికి వర్తించవు అన్నట్లుగా అధికారులు వ్యవహరించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల అధికారులు కనీస పర్యవేక్షణ లేకపోవడం సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



## ఉర్సే షరీఫ్ జాతర మతసామరస్యానికి ప్రతీక

● జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్



జాతర సంతలో పశువులతో రైతులు, మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌షెట్కార్



న్యాల్‌కల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : న్యాల్‌కల్ మండలంలోని గట్టుపైన నిర్వహిస్తున్న ఉర్సే షరీఫ్ పీర్ గైబ్‌సాహెబ్ దర్గా జారత ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ పేర్కొన్నారు. ఆదివారం జాతరలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జాతర సందర్భంగా నిర్వహించే పశువుల సంతకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పశువులతో రైతులు తరలిరావడం సంతోషకరమన్నారు. ఈ జాతర రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. న్యాల్‌కల్ గ్రామానికి చెందిన పశుప్రేమికుడు హోతిబస్వరాజ్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కొన్నేళ్లుగా ఉత్తమపశుపోషకులకు బహుమతులను అందజేయడం అభినందనీయమన్నారు.

## ఏడుపాయలలో భక్తుల సందడి



వనదుర్గ అమ్మవారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

పాపన్నపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గామాత ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పరిసర జిల్లాలు, జంట నగరాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు అమ్మనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం దర్శనం కల్పించారు. మంజీరా నదీపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మాతను దర్శించుకున్నారు. బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## సైనిక్ స్కూల్‌లో ఘనంగా వార్షికోత్సవం

ములుగు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని సైనిక్ స్కూల్ మొదటి వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఏరియా ఎడ్యుకేషన్ డైరెక్టర్ బ్రిగేడియర్ ప్రశాంత్ హల్గేరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రేపటి భవిష్యత్తు కోసం సైన్యంలో దేశభక్తి, క్రమశిక్షణ పాత్రను వివరిస్తూ విద్యార్థులను ప్రేరేపించేలా ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్, ఎక్స్ ఆర్మీ ఆఫీసర్ డా. బి. శేషరెడ్డి నేతృత్వం వహించారు. డైరెక్టర్ డీన్, వినోద్ బంగా(రిటైర్డ్ నేవీ కమాండర్), వైస్ ప్రిన్సిపాల్ మానసా చౌదరి పాల్గొన్నారు.

## ఘనంగా రెసో దర్పణ్ వేడుకలు

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రెసోనెన్స్ గురుకుల స్కూల్ పటాన్‌చెరు క్యాంపస్‌లో ఆదివారం రెసో దర్పణ్ పేరుతో వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రఖ్యాత రచయిత, నటుడు తనికెళ్ల భరణి, సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు. ఐఐటీ జేఈఈ, నీట్, జేఈఈ (మెయిన్స్ + అడ్వాన్స్‌డ్), ఇతర ఇంజనీరింగ్, మెడికల్, కామర్స్ లా ప్రవేశ పరీక్షలలో శిక్షణ ఇచ్చే రెసోనెన్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇనిస్టిట్యూట్ తెలంగాణ, ఏపీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఈ వేడుక విజయాలను గుర్తించడమే కాకుండా ఉత్సాహంతో జరుపుకునే ఒక ప్రయాణం అన్నారు. అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడంలో, స్ఫూర్తిని నింపడంలో ముందుంటున్నారని తెలిపారు. పటాన్‌చెరువు ఎంఈవో నాగేశ్వర్‌నాయక్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## డంపుయార్డ్ నిర్మాణం ఆగే వరకు పోరాటం

● ప్రభుత్వానికి రైతు జేఏసీ హెచ్చరిక.. ఐదో రోజూ నిరసన



గుమ్మడిదలలో ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ

గుమ్మడిదల ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్యారానగర్ డంపుయార్డ్ నిర్మాణం ఆగే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని రైతు జేఏసీ హెచ్చరించింది. గుమ్మడిదల మండలం ప్యారానగర్ గ్రామ శివారులో జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టిన డంపుయార్డ్‌పై మండలంలో చేపట్టిన ఆందోళన ఆదివారం ఐదో రోజుకు చేరింది. గుమ్మడిదల, నల్లవల్లి, బొంతపల్లి, దోమడుగు గ్రామాల్లో జేఏసీ ఆధ్వర్యంలో రోడ్లపైకి వచ్చి, వాడవాడలా తిరుగుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ డంపుయార్డు పనులు ఆపాలని డిమాండ్ చేశాయి. నల్లవల్లి గ్రామంలో ప్రజలు ప్రధాన రహదారిపై బైఠాయించారు. డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని నినదించారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే ఆందోళనను ఇంకా ఉధృతం చేస్తామని హెచరించారు. ఈ గ్రామాల్లో పోలీసులు భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మండల వ్యాప్తంగా గట్టి నిఘా పెట్టారు.

## రాజకీయ లబ్ధి కోసం ఎస్సీ వర్గీకరణ సరికాదు

● రౌండ్ టేబుల్ సమావేశంలో మాల ఉపకులాల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాల ఉపకులాల నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధి కోసం ఎస్సీ వర్గీకరణ సరికాదని మాల ఉపకులాల నాయకులు డిమాండ్ చేశారు. గజ్వేల్ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని గౌరవిస్తూ సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం నడచుకోవాలని, కేంద్ర ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం ఎస్సీలను విభజించు, పాలించు అనే విధానాన్ని అమలు చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ తప్పుడు విధానాలను విరమించుకోవాలని లేనిపక్షంలో మాలల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. ఈ నెల 14న నిర్వహించే రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాలెంక నర్సింలు, చిప్పల యాదగిరి తదితరులున్నారు.

క్రైం కార్నర్

## గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



అబ్దుల్ రహీమ్(ఫైల్)

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన హవేళిఘణపూర్ మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం మెదక్ పట్టణం నవాబుపేటకు చెందిన అబ్దుల్ రహీమ్(27) తల్లిదండ్రులు లేకపోవడంతో చిన్నాన్న వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. ఆదివారం రాత్రి బయటకు వెళ్తున్నాని ఇంట్లో చెప్పి స్కూటీ తీసుకుని వెళ్లాడు. చాలా సమయం అయిన ఇంటికి రాకపోవడంతో రహీమ్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాప్ వచ్చింది. హవేళిఘణపూర్ మండలంలోని ఔరంగాబాద్ శివారులో మెదక్- బోధన్ రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా అక్కడికక్కడే మరణించాడు. మృతదేహం ముక్కలు ముక్కలు కావడంతో గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. మృతుని వద్ద లభించిన డ్రైవింగ్ లైసెన్స్‌తో రహీమ్‌గా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. రహీమ్ బంధువు అబ్దుల్ వాహబ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి పంచనామ నిర్వహించి పోస్టుమార్టుకు పంపినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

## హైవేపై కారు పల్టీ.. నలుగురికి గాయాలు

రామాయంపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నుంచి మహారాష్ట్ర వెళుతున్న కారు అదుపు తప్పి డివైడరు ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆదివారం వేకువజామున రామాయంపేట సమీపంలోని సెల్ టవర్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

శివ్వంపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చిన్నగొట్టిముక్ల గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపి వివరాల మేరకు సంగారెడ్డి జిల్లా కంది మండలం చిగురుప్ప గ్రామానికి చెందిన మడుముల నర్సింహులు(38) భార్య కుటుంబ తగాదాలతో ఎనిమిది నెల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. కాగా మృతుని అన్న మడుముల ఆంజనేయులు బతుకుతెరువు కోసం శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల గ్రామానికి వచ్చి మిషన్ భగీరథ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం అన్న దగ్గర ఉంటున్న తల్లిని చూడడానికి వచ్చిన నర్సింహులు చెరువు సమీపంలో మర్రిచెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. ఈ విషయమై స్థానిక ఎస్ఐ మధుకర్‌రెడ్డిని సంప్రదించగా మృతునికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

## 14 ఎకరాల చెరకు తోట దగ్ధం

● రూ.8 లక్షల వరకు నష్టం



పెద్దారెడ్డిపేట గ్రామ శివారులో తగులబడుతున్న చెరకు తోట

పుల్‌కల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దారెడ్డిపేట గ్రామ శివారులో ఓ రైతుకు చెందిన చెరకు తోట ఆదివారం పూర్తిగా దగ్ధమైంది. గ్రామ శివారులోని 299, 300, 301లో సర్వే నంబర్లలో 14 ఎకరాల్లో గ్రామానికి చెందిన రైతు కుమ్మరి లింగయ్య చెరకు తోటను సాగు చేస్తున్నారు. పంట కోతకు వచ్చినప్పటికీ కూలీల కొరత కారణంగా నరకడానికి ఆలస్యమైంది. అయితే, సోమవారం నుంచి చెరకు తోట నరికేందుకు కూలీలతో ఒప్పందం కుదుర్చుకున్న రైతు లింగయ్య ఆదివారం ఏడుపాయలకు దర్శనానికి బయలుదేరి వెళ్తున్నారు. అంతలోనే చెరకు తోట తగులబడి పోతున్న సమాచారం తెలుసుకుని, జోగిపేటలోని అగ్నిప్రమాద కేంద్రానికి తెలియజేశారు. అగ్నిమాపక వాహనంతో సిబ్బంది హుటాహుటినా అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. మంటలధాటికి తోట పూర్తిగా తగులబడిపోయింది. ఫలితంగా రైతు లింగయ్యకు రూ.8 లక్షలు ఆస్తినష్టం జరిగింది.

## ఓఆర్ఆర్‌పై 23 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



ఔటర్ రింగ్ రోడ్డుపై పట్టుకున్న లారీ

రామచంద్రాపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం ఎస్‌వోటీ, పోలీసులు సంయుక్తంగా సోదాలు నిర్వహించి పెద్ద ఎత్తున రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. కొల్లూరు ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన రాజుచౌహాన్ అనే వ్యక్తి నగరంలోని రాజేంద్రనగర్ నుంచి 23టన్నుల రేషన్ బియ్యాన్ని లారీలో తీసుకుని కర్ణాటకకు తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో కొల్లూరు శివారులోని ఓఆర్ఆర్‌పై తనిఖీ చేపట్టి 23 టన్నుల బియ్యం లోడు లారీని పట్టుకున్నారు. లారీని పోలీసు స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. నిందితుడు రాజుచౌహాన్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. సోమవారం పౌరసరఫరాల శాఖ అధికారులకు బియ్యాన్ని అప్పగిస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాల మైదానంలో సూర్య నమస్కారాల ప్రదర్శన

# వండర్‌ఫుల్



### ఉత్సాహంగా శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన

● వండర్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదు
● 1,484 మంది.. 4,02,154 సూర్య నమస్కారాలతో రికార్డ్

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నాలుగు లక్షలకు పైగా సూర్య నమస్కారాలు చేసి రికార్డ్ నెలకొల్పారు. వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ రికార్డులో నమోదైంది. ఈ అద్భుత కార్యక్రమానికి సిద్దిపేట పట్టణం వేదికైంది. రాష్ట్ర యోగా అధ్యయన పరిషత్ సభ్యులు, జాతీయ యోగా మెడలిస్ట్, ప్రముఖ యోగా గురువు తోట సతీష్ నేతృత్వంలో ప్రభుత్వ బాలికల పాఠశాల మైదానంలో ఆదివారం శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ప్రారంభించారు. రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి వచ్చిన 1,484 మంది యోగా సాధకులు పాల్గొని ఉత్సాహంగా సూర్య నమస్కారాలు చేశారు. లక్ష వరకు చేయడం లక్ష్యం కాగా 4,02,154 సూర్య నమస్కారాలు చేసి యోగ సాధకులు ప్రపంచానికి ఆరోగ్య సందేశాన్ని ఇచ్చారు.

### యోగా ఆరోగ్య ప్రదాయిని

యోగా శారీరక ధృడత్వాన్ని, మానసిక



వండర్ బుక్ ఆఫ్ రికార్డు ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ అందుకుంటున్న నిర్వాహకులు, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, జడ్జి స్వాతిరెడ్డి

ప్రశాంతతను చేకూర్చుతూ ఆరోగ్య ప్రదాయినిగా నిలుస్తుందని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. మారుతున్న పరిస్థితుల్లో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యాన్ని అందించే యోగ మానవాళికి అమృత వాహిని అన్నారు. ఈ అద్భుత ప్రదర్శన ద్వారా సిద్దిపేట జిల్లా కీర్తిని ప్రపంచానికి సగర్వంగా చాటి చెప్పిన నిర్వాహకులను అభినందించారు. ఈ ప్రదర్శనలో కొందరు వృద్ధులు సైతం ఉత్సాహంగా పాల్గొని అద్భుత ప్రదర్శనతో భావితరాలకు స్ఫూర్తి అందించారని ప్రశంసించారు.

సిద్దిపేట సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి మాట్లాడుతూ భారతీయ యోగశాస్త్రం ప్రపంచానికి మార్గదర్శకమన్నారు. ఆరోగ్యానికి దగ్గరగా ఉండాలనుకునేవారు యోగ సాధన చేయాలని సూచించారు. రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రావు మాట్లాడుతూ ముంచుకొస్తున్న ముప్పుల నుంచి యోగ సాధన మాత్రమే మనలను రక్షిస్తుందని స్పష్టం చేశారు. కరోనా సమయంలో ఎందరో వ్యక్తులు యోగాసాధనతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని గుర్తుచేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలను విస్తృత పరుస్తున్నామని చెప్పారు. రాష్ట్ర యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం విభిన్న యోగా కార్యక్రమాలతో సమాజాన్ని ఇటు వైపు మళ్లించడానికి ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడానికి పనిచేయాలని సూచించారు.



శత సహస్ర యోగా ప్రదర్శనలో పాల్గొన్న యోగా సాధకులు

### రాష్ట్రస్థాయి యోగా పోటీలు

శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన రికారు నెలకొల్పగా ఇదే వేదికగా రాష్ట్రస్థాయి యోగా పోటీలను నిర్వహించారు. 25 సంవత్సరాలలోపు, 25 సంవత్సరాలపై వయస్సు వారికి పురుషులకు, మహిళలకు వేర్వేరుగా పోటీలు జరిగాయి. నాలుగు విభాగాల్లో జరిగిన పోటీల్లో ఐదు సంవత్సరాల నుంచి మొదలుకుని 72 సంవత్సరాల వయసున్న వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డు ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు, యోగా సాధకులకు అతిథులు మెడల్, సర్టిఫికెట్లను ప్రధానం చేశారు.

ఆ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు విరాహత్ అలీ, సిద్దిపేట జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు రంగాచారి, వ్యాస మహర్షి యోగా సొసైటీ చైర్మన్ డాక్టర్ అరవింద్, సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ విక్రమ్ రెడ్డి, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, ట్రస్మా సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ

బీఆర్ఎస్ పని అయిపోయింది
ఉద్యమగడ్డ అని చెప్పుకునే జిల్లాలోనే అభ్యర్థి లేడు
మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యనే ప్రధాన పోటీ ఉంటుందని భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లోనూ ఈ రెండు పార్టీల మధ్యనే పోరు జరగనుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పని అయిపోయిందన్నారు. పొద్దున లేస్తే 'మా సత్తా చూపిస్తాం' అని చెప్పుకునే బీఆర్ఎస్ పార్టీకి నలుగురు మేధావులు, పెద్దమనుషులు ఉన్న సొంత జిల్లాలోనే అభ్యర్థి లేకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా ఎప్పుడైతే మారిందో అప్పుడే ఆ పార్టీ పని కథ ముగిసిపోయిందని ఎద్దేవాచేశారు. భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేస్తే బీఆర్ఎస్‌కు మూడో స్థానమే మిగులుతుందన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డికి కుర్చీ భయం పట్టుకుందని 14 నెలలలో కాంగ్రెస్ రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమీ లేదని విమర్శించారు. దేశంలో మూడు రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారంలో ఉందని అవి కూడా పూర్తయిపోతే కాంగ్రెస్ ముక్తాభారత్‌గా మిగులుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడానికి ప్రజలు మేధావులు సిద్ధంగా లేరని, ఇక మిగిలింది బీజేపీ ఒక్కటేనన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు దూది శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌కు మిగిలింది గాడిద గుడ్డు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మిగిలింది గాడిద గుడ్డు అని, ప్రజలు గుండు సున్నాకు పరిమితం చేశారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మెదక్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఢిల్లీలో చెల్లె కవితతో కలిసి సీసాలు అమ్మితే వచ్చి డబ్బుతో కేజ్రీవాల్ శీష్‌మహల్ పేరుతో అద్దాల మేడ నిర్మించాడని ఆరోపించారు. అవినీతి మరకు ఉన్నా ఏ రాజకీయ పార్టీని ప్రజలు దగ్గరకు తీయలేదన్నారు. ప్రస్తుత సమాజంలో మార్పు వచ్చిందని, కష్టపడి నిజాయితీగా ఉంటేనే ప్రజలు ఆదరిస్తారని, లేదంటే అధఃపాతానికి తొక్కుతారని ఢిల్లీలో వచ్చిన ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. భవిష్యత్‌లో తెలంగాణలో వచ్చేది బీజేపీ సర్కారే అని ఎంపీ ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పట్టుభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు మల్లేశంగౌడ్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఎంఎల్ఎన్‌రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి పంజా విజయ్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రమాణ' జోష్



పాట పాడుతున్న ప్రముఖ సింగర్ మంగ్లీ



కేరింతలు కొడుతూ సెల్ఫీ దిగుతున్న విద్యార్థులు



యువతి ర్యాంప్ వాక్

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్, డీజే నైట్, ర్యాంప్ వాక్, ఆటో ఎక్స్‌పో, వర్క్‌షాప్స్ ఒకటేమిటి ఇలా సాంస్కృతిక, సాంకేతిక కార్యక్రమాలతో గీతం వర్సిటీ హోరెత్తింది. పటాన్‌చెరు రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రమాణ-2025 వేడుక ఆదివారంతో ముగిసింది. ఈ వేడుకలో విద్యార్థుల ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసే పలు కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం మ్యూజికల్ నైట్‌లో ప్రముఖ సింగర్‌లు మంగ్లీ, నిఖితా గాంధీ తమ పాటలతో హుషారెత్తించారు. చివరి రోజు ప్రపంచ ప్రసిద్ధ జూలియా బ్లిస్, ప్రో బ్రదర్స్ అద్భుతమైన ఈడీఎం - డీజే నైట్ ప్రదర్శనతో వేడుకను విజయవంతంగా ముగించారు. గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు పర్యవేక్షణలో రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, అధ్యాపక సలహాదారు ప్రొఫెసర్ పి.త్రినాథరావు, డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ప్రతినిధి రాహుల్ మండల్, అధ్యాపకులు, ప్రమాణ కోర్ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

## ఫిబ్రవరిలోనే మండుతున్న ఎండలు

# సన్‌డే

ఉమ్మడి జిల్లాలో 37 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
సాధారణం కంటే 3 డిగ్రీలు అధికం
అత్యధికంగా సిద్దిపేటలో 37.5 డిగ్రీలు
మున్ముందు మరింత పెరిగే అవకాశం



మెదక్ అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. చలి తీవ్రత తగ్గడంతో సూరీడు సుర్రుమంటున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండడంతో ఉక్కపోత మొదలైంది. మార్చి నెలలో నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతలు ఇప్పుడు ఫిబ్రవరిలోనే రికార్డు కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా సిద్దిపేటలో 37.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో 37.1, డిగ్రీలు, వట్‌పల్లిలో 36.1, మెదక్ జిల్లా నర్సాపూర్‌లో 36.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే మూడు డిగ్రీలు అధికమని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో కూడి పెరుగుదల కనిపిస్తోంది. మొన్నటి వరకు 12 నుంచి 15 డిగ్రీల వరకు నమోదయ్యాయి. అయితే, ఆదివారం ఉమ్మడి జిల్లాలో అన్ని మండలాల్లో 16 నుంచి 21 డిగ్రీల వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

### వేడిగాలుల ప్రభావంతో..

తూర్పు ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్న వేడి గాలులు ప్రభావంతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయని వాతావరణ శాఖ కేంద్రం అధికారులు చెబుతున్నారు. మార్చి నెలలో నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతలు ఫిబ్రవరి నెలల ఆరంభం నుంచి ఎండలు దంచికొడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. మున్ముందు ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. రానున్న మూడు రోజుల పాటు వాతావరణం పొడిగా ఉంటుందని తెలిపింది. ఇక ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో పాటు ఫ్యాన్లు, ఏసీలు, కూలర్ల వినియోగం కూడా పెరిగింది. పెరుగుతున్న ఎండల నేపథ్యంలో ప్రజలు సరైన జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# పీహెచ్‌సీకి ఖాళీ స్థలమే వద్దా?

- రాయపోల్ మండల కేంద్రంలో అభివృద్ధి పని ఏదైనా అధికారుల చూపు ఆ స్థలం వైపే
- ఇప్పటికే రైతు వేదిక, పల్లె ప్రకృతి వనం, నర్సరీల ఏర్పాటు
- తాజాగా ఇందిరమ్మ మోడల్ ఇంటి కోసం ముగ్గు పోసిన అధికారులు




రాయపోల్ మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం, ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం, నర్సరీ

రాయపోల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మారుమూల పల్లెల్లో పేదల వైద్యావసరాలు తీర్చేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే కీలకమనే విషయం తెలిసిందే. ఆస్పత్రులకు వచ్చే రోగులకు ప్రశాంతత ఉంటే సగం రోగం నయం అవుతుందని ఆరోగ్య నిపుణులు, డాక్టర్లు చెబుతారు. ఇందుకు అనుగుణంగానే రాయపోల్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భవిష్యత్ అవసరాల దృష్ట్యా విశాలమైన స్థలాన్ని కేటాయించి ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ స్థలం క్రమంగా ఇతర శాఖల ఆధీనంలోకి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

### పీహెచ్‌సీ స్థాయి పెంపునకు అడ్డంకిగా..

రాయపోల్‌లో ఎలాంటి ప్రభుత్వ అభివృద్ధి పనులు చేపట్టాలన్నా స్థానికంగా ఉన్న పీహెచ్‌సీలోని ఖాళీ స్థలంవైపే అధికారులు దృష్టి సారించడం పరిపాటిగా మారింది. రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 20గ్రామాలకు పైగా ఉన్నాయి. ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజూ సుమారు వంద మందికి పైగా వివిధ వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఉంటారు. ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించిన వైద్య చికిత్సలు కూడా ఇందులోనే చేస్తారు. ఇదిలా ఉండగా ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుకభాగంలో ఖాళీ స్థలం ఉన్నది. ఎప్పుడైనా పీహెచ్‌సీ స్థాయిని పెంచాల్సిన అవసరం వస్తే అందుకు సంబంధించిన భవనాల నిర్మాణానికి స్థలం సమస్య లేకుండా ఉంటుందని గ్రామస్థులు భావించారు. భవనంతో పాటు ఖాళీ స్థలానికి ప్రహరీని నిర్మించారు. ప్రహరీతో ఖాళీ స్థలానికి రక్షణ ఉన్నప్పటికీ, ఇతర అభివృద్ధి పనుల కోసం ఈ ఖాళీ స్థలాన్ని ఆయాశాఖలవారు ఆధీనంలోకి తీసుకుని వినియోగిస్తుండటంతో భవిష్యత్తులో పీహెచ్‌సీస్థాయి పెంపు విషయం ప్రశ్నార్థకంగా మారింది.

### అభివృద్ధి పనులకు స్థలాల కొరత

మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ అభివృద్ధి పనులు, నూతన భవనాల నిర్మాణానికి ఇబ్బందిగా పరిణమించింది. దీంతో మండల కేంద్రానికి ఎలాంటి అభివృద్ధి పనులు లేదా భవనాలు మంజూరైనా అధికారుల దృష్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఖాళీ స్థలంపైనే పడుతున్నది. ఇప్పటికే పీహెచ్‌సీ ఖాళీ స్థలంలో రైతు వేదిక నిర్మించారు. అలాగే పల్లె ప్రకృతి వనాన్ని ఇందులోనే ఏర్పాటు చేశారు. వీటికి తోడు నర్సరీ కూడా అందులోనే ఉన్నది. దీంతో ఈ పీహెచ్‌సీకి చెందిన ఖాళీ స్థలం దాదాపుగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో నిండిపోయింది.



### ఇందిరమ్మ ఆదర్శ గృహానికీ ముగ్గు ఇక్కడే..

ప్రతీ మండల కేంద్రానికి ఒక ఇందిరమ్మ మోడల్ భవనాన్ని నిర్మించి పేదలకు చూపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రెవెన్యూ అధికారులు స్థల అన్వేషణలో పడ్డారు. స్థలం ఎక్కడ అందుబాటులో లేకపోవడంతో వారి కన్ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఖాళీ స్థలంపైన పడింది. వెంటనే రెవెన్యూ అధికారులు ఇందిరమ్మ ఆదర్శ గృహం కోసం పీహెచ్‌సీ ఖాళీ స్థలాన్ని ఎంపిక చేసిన ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. అనంతరం ఇటీవల హౌజింగ్ అధికారులు ఈ స్థలంలో మార్కింగ్ ఏర్పాటు చేసి పునాదుల కోసం ముగ్గులు పోశారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం తప్ప మిగతా ఖాళీ స్థలం దాదాపుగా ఇతర శాఖల ఆధీనంలోకి చేరిపోయింది. ఇప్పటికైనా అధికారులు ఇందిరమ్మ ఆదర్శ గృహ నిర్మాణాన్ని మరో స్థలంలో చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## వర్గల్‌లో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

వర్గల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండల కేంద్రంలో శ్రీ కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయంలో నూతన ఆలయంలో శ్రీ భ్రమరాంబిక, కేతమ్మ సమేత మల్లిఖార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద గోపూజ, గురవందనం, గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, కలశ స్థాపన, జలాధివాసములు తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం గంగ తెప్పకు పోవుట, గంపలు తీయుడంతో పాటు ఇతర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాలు యాదవ్‌తో పాటు యాదవ సంఘం నాయకులు పెద్దగొల్ల యాదయ్య, పుల్లయ్య, శ్రీశైలం, స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్నను దర్శించుకున్న చొప్పదండి ఎమ్మెల్యే



మల్లన్న సన్నిధిలో కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పూజలు

చేర్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈసందర్భంగా స్వామివారిని దర్శించుకుని అభిషేకం జరిపి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వీరశైవార్చకులు స్వామివారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు మహదేవుని శ్రీనివాస్ తదితరులున్నారు.

# సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూదే కీలకపాత్ర

- పీఆర్టీయూ ఆవిర్భావ వేడుకలు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ 54వ ఆవిర్భావ వేడుకలను ఆదివారం జిల్లాలోని పీఆర్టీయూ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాపీఆర్టీయూ జెండాలను ఎగురవేసి, కొన్నేళ్లుగా విశేష సేవలందించినవారిని సన్మానించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో ఆవిర్భావ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీఆర్టీయూ జెండాను ఎగురవేశారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘంలో కొన్ని దశాబ్దాల పాటు విశేషమైన సేవలు అందించి ఇటీవలే రిటైర్ అయిన సంఘ నాయకులకు ఘనంగా సన్మానించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగా మహేందర్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదరానుపల్లి శశిధర్‌శర్మ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నర భాస్కర్‌రెడ్డి, పాతూరు సుజాత, నీలం శ్రీనివాస్, ఆస లక్ష్మణ్, అనిల్ కుమార్ పాతూరి రమాదేవి, ఎల్లంకి అనిత, సీహెచ్ అనీల్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో పీఆర్‌టీయూ జెండాను ఎగురవేస్తున్న మండలాధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి

- గజ్వేల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూదే కీలకపాత్ర అని మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, తిగుళ్ల లింగంగౌడ్‌లు పేర్కొన్నారు. పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని పీఆర్టీయూ కార్యాలయం వద్ద జెండాను ఎగురువేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల జీవన ప్రమాణాలు పెంపొందించడంలో పీఆర్టీయూ అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పత్రికాసంపాదకులు ఊడెం జైపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, జానకిరాంరెడ్డి, ఊడెం వేమారెడ్డి, కుకునూరి శేఖరణ్, శ్రీనివాస్‌రావు, పోచయ్యగౌడ్, హన్మంత్‌రెడ్డి తదితరులున్నారు.

## ప్రారంభానికి నోచుకోని రజక భవనం



వినియోగంలోలేక రజక సంఘం భవనం పరిసరాల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, పొదలు

ములుగు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలో రజకుల కోసం ప్రత్యేక భవనాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో స్థలాన్ని కేటాయించారు. అదేసమయంలో గడాకు సంబంధించి రూ. 20లక్షల నిధులతో భవన నిర్మాణం చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై దాదాపు ఏడాదికి పైగా కాలం గడిచినా రజక సంఘం భవనం ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు చేపట్టి భవనాన్ని ప్రారంభించాలని రజక సంఘం సభ్యులు కోరుతున్నారు.

## మట్టి టిప్పర్లతో రోడ్లు ధ్వంసం



అధిక లోడ్ వాహనాల రాకపోకలతో ధ్వంసమైన రోడ్డు

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రైల్వేలైన్ పనుల కోసం మట్టిని తొలగించే బాధ్యతను ఓ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించగా, నల్ల రేగడి మట్టిని కాంట్రాక్టర్ గ్రామంలోని రైతులతో పాటు చుట్టుపక్కల అమ్ముకుంటూ జేబులో నింపుకుంటున్నాడు. అయితే అధిక లోడుతో 24 గంటలు గ్రామంలోని రోడ్లపై టిప్పర్ వాహనాలు సంచరిస్తూ ఉండడంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. ఇదివరకే అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు మట్టి టిప్పర్ల రాకపోకలతో మరింత ధ్వంసమవుతున్నాయి. మట్టి తరలింపునకు గ్రామపంచాయతీ నుంచి అనుమతి తీసుకోవలసి ఉండగా, ఎలాంటి అనుమతులు లేకుండానే దర్జాగా మట్టిని తరలిస్తూ అమ్ముకోవడం చర్చనీయాంశంగా మారింది. గతంలో అధికారులకు సమాచారం అందించినా చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

### పలువురికి ఆర్థిక సాయం

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ 4వ వార్డుకు చెందిన నర్సి చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. లక్ష్మి ఫౌండేషన్ చైర్మన్, 3వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మి కనకయ్య ముదిరాజ్ ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. వెంట 16వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డాకని భిక్షపతి, 4వ వార్డు అధ్యక్షుడు ఎక్కల దేవి కనకరాజు యాదవ్, 3వ వార్డు అధ్యక్షుడు శ్రీరామ్ మల్లేశం, గజ్వేల్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

- మర్కుక్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామరకుంట గ్రామానికి చెందిన బచ్చన్న నర్సయ్య(78) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఆదివారం మర్కుక్ మాజీ ఎంపీపీ పాండుగౌడ్, మాజీ జడ్పీటీసీ యెంబరి రామచంద్రం యాదవ్, ఎంపీటీసీల ఫోరం మర్కుక్ మాజీ మండలాధ్యక్షుడు రాజమైన కృష్ణయాదవ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

### ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో..
### నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాకేశ్ కృష్ణన్

చేర్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపుకోసం కాంగ్రెస్ పార్టీ పలువురిని నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలుగా నియమించింది. చేర్యాల మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందిగ రాకేశ్‌కృష్ణన్‌ను హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు.

ఘనంగా

### ఆత్మీయ సమావేశం

మద్దూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్మాముల గ్రామంలో 1989-90 బ్యాచ్ 7వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఆత్మీయ సమావేశాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఆత్మీయ పలకరింపులు, గురువులకు సన్మానాలతో సమావేశం ఆద్యంతం ఉత్సాహంగా కొనసాగింది.

## చేర్యాలలో వానరమూక స్వైరవిహారం



అంబేడ్కర్‌నగర్ కాలనీలోని ఓ పెంకుటింటిపై కోతుల హంగామా, పోలీస్‌స్టేషన్ సమీపంలో సంచారం

చేర్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలో వానరమూక స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా వీధుల గుండా సంచరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి అందిన వస్తుసామగ్రిని అందుకుపోతూ నానా హంగామా చేస్తున్నాయి. అడ్డుకునే యత్నంలో దాడికి ప్రయత్నిస్తుండటంతో ఇళ్లవద్ద మహిళలు, పిల్లలు బెంబేలెత్తిపోతున్నారు. చాలాకాలంగా కోతుల బెడద తీర్చాలని ప్రజలు వేడుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాడుబడిన గోడలు, పెంకిటిళ్లపై కూర్చుని పెంకులను ఊడబెరుకుతూ, రేకుల షెడ్లపై గెంతుతూ బీభత్సం సృష్టిస్తున్నాయి. దీంతో జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. మునిసిపల్ అధికారులు స్పందించి కోతుల బెడద తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

## సాధ్యంకాని హామీలతో వంచన: బీఆర్ఎస్



సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు

ధూళిమిట్ట,ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెక్కల్, తోర్నాల గ్రామాల్లో ఆదివారం స్థానిక ఎన్నికల దృష్ట్యా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. దరఖాస్తుల పేరిట ప్రజలను ఇబ్బంది పెట్టడం తప్పితే చేసిందేమీలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఏమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో కార్యకర్తలందరూ ఐకమత్యంతో పనిచేసి విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంద యాదగిరి, సొసైటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, నాయకులు నిమ్మ రాజీవ్ రెడ్డి, పుర్మ వెంకట్ రెడ్డి, పచ్చిమడ్ల సతీష్ గౌడ్, నాచగోని వెంకట్ గౌడ్, సాగర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



సీఎం, మంత్రుల ఫ్లెక్సీకి యూత్ కాంగ్రెస్ నాయకుల క్షీరాభిషేకం

ధూళిమిట్ట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రభుత్వంలో కుల గణన చేయడం, ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీలో ప్రవేశపెట్టడం లాంటి సాహసోపేతమైన నిర్ణయాలను సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్నారని మండల కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి పిలుపు మేరకు మండలకేంద్రంలో యూత్ కాంగ్రెస్ నాయకుల అధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పోన్నం ప్రభాకర్ గౌడ్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అధికారులతో పకడ్బందీగా కులగణన సర్వే చేస్తే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందీగా రాకేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కమలాకర్ యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు కర్క సంతోష్ రెడ్డి, జనగామ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాల్గొన్నారు

## 19న చేర్యాలలో శివాజీ ర్యాలీ

చేర్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 19న చేర్యాల పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు చత్రపతి శివాజీ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బొంగురం జితేందర్‌రెడ్డి, పెద్ది తిరుపతిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు గాంధీచౌక్ నుంచి శివాజీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం శివాజీ విగ్రహం వద్ద ప్రముక వక్త దేశపతి ఆమోఘ్ ప్రసంగం ఉంటుందని తెలిపారు. ర్యాలీలో హిందూ బంధువులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## మృతుల కుటుంబాలకు మాజీమంత్రి పరామర్శ



సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్‌లో మాజీసర్పంచ్‌ను పరామర్శిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట రూరల్/చేర్యాల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందినవారి కుటుంబాలను ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్ మాజీ సర్పంచ్ కుమారుడు ఇటీవల చికిత్సపొందుతూ మరణించగా, మాజీ సర్పంచ్ కుటుంబాన్ని ఓదార్చి, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. సీతారాంపల్లి గ్రామానికి చెందిన గుర్రం గ్రీష్మ అరుదైన వ్యాధితో హైదరాబాద్ ఆసుపత్రిలో చిక్సి పొందుతూ మరణించింది. వారి కుటుంబాన్ని మాజీమంత్రి పరామర్శించి అదుకుంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. మాచాపూర్‌లో పక్షవాతంతో బాధపడుతున్నా ఆర్టీసీ ఉద్యోగి కాంతారావును, రోడ్డు ప్రమాదంలో గాయపడిన కిష్టారెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అదేవిధంగా నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన పాతురి రవీందర్ రెడ్డి అకాల మరణం చెందగా వారి కుటుంబాన్ని ఓదార్చారు. కొమురవెల్లి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన బీఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొంగు రాజేందర్‌రెడ్డి నానమ్మ ఇటీవల మరణించడం పట్ల సంతాపం వ్యక్తంచేస్తూ కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రావు, చందర్‌రావు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు నాయకులు కడవేరుగు రాజనర్సు, మచ్చ మల్లికార్జున్, అంకుగారి శ్రీధర్‌రెడ్డి, ఏర్పుల మహేశ్, సిలివేరి సిద్ధప్ప, పచ్చిమడ్ల సిద్దిరాములు, పచ్చిమడ్ల మానసతో పాటు చేర్యాల, కొమురవెల్లి మండలాల నాయకులు ఉన్నారు.

## నేటి నుంచి విశ్వ బ్రాహ్మణుల పనులు బంద్

హుస్నాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పని రేట్ల పెంపుదల డిమాండ్ చేస్తూ హుస్నాబాద్‌లో సోమవారం నుంచి గురువారం వరకు పనులను బంద్ చేస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు ఎగ్గోజు శ్రీనివాసచారి, పట్టణ అధ్యక్షుడు పోలోజు సదానందచారి పేర్కొన్నారు. ఈ విషయంపై ఆదివారం విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ముడి సరుకులు, కూలీల రేట్లు పెరిగినందున బంద్‌కు నిర్ణయం తీసుకున్నామని, దీనికి గృహ యజమానులు, వినియోగదారులు సహకరించాలని కోరారు. సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కందారపు రాజమౌళిచారి, లక్ష్మీనారాయణ, నర్సింహాచారి, కనుకాచారి, విష్ణుమూర్తి, సంపత్, శ్రీనివాస్ తదితరులున్నారు.

## పలువురికి డప్పులు అందజేత



చిన్నకిష్టాపూర్‌లో డప్పులను అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాలకు అండగా ఉండాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బుచ్చన్నగారి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిన్నకిష్టాపూర్‌లో శ్రీకాంత్‌రెడ్డి 53మందికి డప్పులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామ ఎమ్మార్పీఎస్ అంబేడ్కర్ సంఘం నాయకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ భగవాన్, మాజీ సర్పంచ్ ఎర్రోళ్ల కనకయ్య, ఎర్రోళ్ల యాదయ్య, దుర్గారెడ్డి, సోమీ కరుణాకర్, ప్రవీణ్, అరుణ్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నాళ్లకెన్నేళ్లకు..



కొండపాక మండలం దుద్దెడ ఉన్నత పాఠశాలలో పదోతరగతి 1991-92 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం జరుపుకున్నారు. దాదాపు 3 దశాబ్దాల కాలం తర్వాత అందరూ ఒక్కచోట కలుసుకోవడంతో 'మధుర స్మృతుల కోసం మళ్లీ ఒక రోజు' అనే క్యాప్షన్‌తో సమ్మేళనం నిర్వహించి, తమ గురువులను సత్కరించారు. చిన్ననాటి మధురస్మృతులను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన బత్తుల నారాయణ, నాగేశ్వర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, అంజయ్య, చంద్రారెడ్డి లను సత్కరించారు. ఆటపాటలతో సందడి చేశారు.

**- కొండపాక, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి)**

కుకునూరుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ (2010-11) బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయసమావేశం జరుపుకుని సందడి చేశారు. చాలా కాలం తర్వాత ఒక్కచోట కలుసుకోవడంతో ఆత్మీయంగా పరస్పర క్షేమసమాచారాలను పంచుకున్నారు. తాము చేసిన అల్లరి పనులను, తమకు విద్యనేర్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. రోజంతా ఆడిపాడి ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు.

**- కుకునూరుపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి)**




చేర్యాల పట్టణంలోని శుభోదయ విద్యానికేతన్ హైస్కూల్ 2012-13 బ్యాచ్ పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయసమ్మేళన కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. తమ చిన్ననాటి చిలిపి పనులను నెమరు వేసుకున్నారు. వేర్వేరు వృత్తులలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సత్కరించారు. రోజంతా ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.

**- చేర్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి)**





గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీ 2004-2005 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించుకున్నారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో గురువులతో తమ అనుబంధాన్ని, ఆత్మీయతను, గత స్మృతులను నెమరువేసుకున్నారు. పరస్పర క్షేమసమాచారాలను పంచుకున్నారు. విద్య నేర్పిన గురువులను శాలువాలతో సత్కరించారు. రోజంతా ఉత్సాహంగా గడిపారు.

**- గజ్వేల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి)**